క్లుప్తంగా

గ్రూప్-2 మెయిన్స్ ఉచిత శిక్షణ తరగతులు

చీరాల రూరల్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష కోసం నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎంఎల్‌జే కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు మంగళవారం తెలిపారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో నేటి నుంచి నిర్వహించనున్నామని చెప్పారు. తమ కళాశాల ఆధ్వర్యంలో గతనెలలో గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షల కోసం నిర్వహించిన ఉచిత శిక్షణలో 90 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 40 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. కళాశాల తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. నేటి నుంచి నెలరోజులు పాటు నిర్వహించే ఈ ఉచిత శిక్షణ తరగతులను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉచిత శిక్షణ తరగతులతో పాటు స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు.

వైద్యశాల ఆకస్మిక తనిఖీ



కళ్లజోళ్లు అందజేస్తున్న జిల్లా వైద్యశాలల సమన్వయకర్త

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం బాపట్ల జిల్లా సమన్వయ అధికారి ఏవీ శేషు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆరోగ్యశ్రీ కేసులు గురించి బ్లడ్‌బ్యాంక్, ట్రామా కేసులు, శస్త్ర చికిత్సలకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం కంటి విభాగంలో రోగులకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారులు డి. శరత్‌కుమార్, కె. వాహిలచౌదరి, పీ. వెంకట్ కిరణ్, కె. శ్యామ్ బాబు, జీ ప్రదీప్తి, లక్ష్మీశ్రుత కీర్తి, టి.సురేంద్ర, విష్ణు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అదుపులో గ్రానైట్ లారీలు



బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించిన గ్రానైట్ లారీలు

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ లారీలను మైన్స్ విజిలెన్స్ ఏడీ వీరేష్ మంగళవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి పర్మిట్ లేకుండా వేమవరం జంక్షన్ మార్టూరు వైపు వెళుతున్న లారీలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా మీటరు ముడిరాళ్లు, స్లాబులు తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. ఎంతటి వారిపైనైనా పెనాల్టీతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించి పర్మిట్‌తోనే ఎగుమతులు చేపట్టాలని ఏడీ వివరించారు.

కాంగ్రెస్ పార్టీ రెండో సెట్ నామినేషన్ దాఖలు



రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా అడుసుమల్లి కిషోర్‌బాబు రెండో సెట్ నామినేషన్ పత్రాలను మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌వో టీవీ సునీల్‌కు అందజేశారు. ఈ అభ్యర్థి మొదటి సెట్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

బల్లికురవ: పథకం ప్రకారం గ్రానైట్ క్వారీలో యంత్రాలకు విద్యుత్ సరఫరానిచ్చే ఎంతో విలువైన కేబుల్ వైరు చోరీకి దొంగలు యత్నించారు. అలికిడికి వాచ్‌మెన్ కేకలు వేయటంతో కట్‌చేసిన వైరును అక్కడే వదిలివేసి పలాయనం చిత్తగించారు. ఈఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని ఈర్లకొండ కొండాయపాలెం గ్రామ సమీపంలోని వింటర్ గ్రానైట్ క్వారీలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం యాజమాన్యం, కార్మికులు సోమవారం రాత్రి పనులు ముగిసిన తదుపరి కార్యాలయానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో యంత్రాలకు వెళ్లే కేబుల్ వైరును కట్‌చేశారు. మరోవైపు కట్ చేస్తుండగా శబ్దాలు రావటంతో వాచ్‌మెన్ కేకలు వేశారు. ఈ కేకలకు దొంగలు చోరీ చేసిన కేబుల్ వైరును అక్కడే వేసి పరుగు తీశారు. ఈ కేబల్ వైరు విలువ సుమారు రూ. 7 లక్షల వరకు ఉంటుందని క్వారీ యాజమాన్యం మంగళవారం తెలిపారు. ఇటీవల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి రాగివైర్లు సోలార్ ప్లేట్లు చోరీకి గురవుతున్నాయి. తాజాగా క్వారీలో కూడా కేబుల్ వైరు చోరీకి ప్రయత్నం చేయటంతో క్వారీ యజమానులు భయందోళన చెందుతున్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ, ఎంపీ అభ్యర్థి సురేష్



మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ, పక్కన ఎంపీ అయోధ్య రామిరెడ్డి



కారంచేడు వద్ద బాలాజీపై పూలవర్షం కురిపిస్తున్న స్థానిక నాయకులు

మీబిడ్డగా నన్ను ఆశీర్వదించండి..

- వేడుకగా వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్
- స్వచ్ఛందంగా తరలిన అశేష జనం
- ఎటు చూసినా జైజగన్.. జై బాలాజీ నినాదాలు
- ఊరూరా వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్

మార్టూరు/చినగంజాం/కారంచేడు/యద్దనపూడి: మీ బిడ్డగా నన్ను ఆశీర్వదించి పర్చూరు ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ కోరారు. మంగళవారం యడం బాలాజీ అట్టహాసంగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా పర్చూరు వైపు వెళ్తూ కారంచేడు మండల ప్రజలకు ఆయన అభివాదం చేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీ సమీపం నుంచి ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ పర్చూరు ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాంప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. ఈసందర్భంగా కార్యకర్తలనుద్దేశించి బాలాజీ మాట్లాడుతూ మీ బిడ్డగా నేను మీ అందిరికీ అందుబాటులో ఉంటూ మీకు జగనన్న సుపరిపాలనను అందిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పార్టీ కన్వీనర్ దండా చౌదరిబాబు, యార్లగడ్డ పాపారావు, ముల్లా నూర్‌అహ్మద్, గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, నాదెండ్ల నాగరాజు, కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, యర్రం లక్ష్మారెడ్డి, కొడాలి ధర్మానంధరావు, గోగినేని సతీష్‌బాబు, గోగినేని బుల్లెబ్బాయి, మాదాసు కుమారి, చిన్నా, జాగర్లమూడి ఆంజనేయులు, చౌదరి, వెంపరాల సుబ్బారాయుడు, గంగరాజు, శ్రీనివాసరెడ్డి, దేవగిరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. స్వర్ణపాలెం బసవయ్య, మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు.

తిరునాళ్లను తలపించిన నామినేషన్ ఘట్టం..

నామినేషన్ వేసేందుకు బయలుదేరిన యడం బాలాజీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చీరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలిసి బయలు దేరిన బాలాజీకి కారంచేడు రామానాయుడు కల్యాణ మండపం వద్ద స్థానికులు క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు. గ్రామంలో పార్టీ నాయకులతో ప్రదర్శనగా బయలుదేరిన బాలాజీకి కారంచేడు చిన్నవంతెన సెంటర్‌లో దగ్గుబాటి పురందేశ్వరి నివాసం వద్ద క్రేన్ సాయంతో మరో రెండు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కాలువ సెంటర్‌లో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో స్వర్ణరోడ్డు నుంచి వందలాది వాహనాలతో పార్టీ శ్రేణులు కారంచేడు చేరుకున్నారు. అదే సమయంలో కాలువ కుడి వైపు గ్రామం కుంకులమర్రు నుంచి మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో వందలాది వాహనాలతో కార్యకర్తలు కారంచేడు చేరుకోవటంతో తిరునాళ్ల వాతావరణం ఏర్పడి కొంత సేపు ట్రాఫిక్‌కు అవరోధం ఏర్పడింది. వాసుబాబు క్రేన్ సాయంతో మరోసారి గజమాలతో బాలాజీని ఘనంగా సత్కరించి సన్మానించారు. అక్కడి నుంచి బయలు దేరిన ఆయన పర్చూరు బొమ్మల సెంటర్‌కు చేరుకొని అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నామినేషన్ వేసేందుకు బయలు దేరి వెళ్లారు. కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలు నుంచి పర్చూరు చేరుకోవడంతో రోడ్లన్నీ కార్యకర్తల సందడితో నిండిపోయాయి. డప్పు వాయిద్యాలతో, తీన్‌మార్‌లతో, యువకులు కేరింతల నడుమ పర్చూరు వైఎస్సార్ సీపీ పార్టీ నినాదాలతో మార్మోగి పోయింది.

- మార్టూరు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పర్చూరు తరలి వెళ్లారు. యద్దనపూడి మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పర్చూరు తరలివెళ్లారు. యడం బాలాజీ నామినేషన్ సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతరను తలపించింది. పర్చూరు చేరుకున్న నాయకులు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ సందడి చేశారు. వేలాదిగా తరలివచ్చిన జనసంద్రంతో రోడ్లన్ని కిక్కిరిసిపోయాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు, ఎంపీపీ పులగం రజనీ, మువ్వల రాంబాబు, మార్నెళ్ల శ్రీధర్, రావూరి వేణుబాబు, ధూళ్లిపాళ్ల వేణు, చెరుకూరి వేణు, సన్నెబోయిన వెంకటప్పయ్య, జంపాని కోటేశ్వరావు, మేకా సుధాకర్, దొడ్డా రవి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగంజాంలో

పర్చూరులో నామినేషన్ దాఖలు చేయనున్న యడం బాలాజీ నామినేషన్ కార్యక్రమానికి చినగంజాం మండలం నుంచి మంగళవారం భారీగా తరలి వెళ్లారు. మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వర రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో వేలాదిగా తరలి వెళ్లారు.



బాలాజీ నామినేషన్‌కు వచ్చిన అతిథులను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



జాగర్లమూడి నుంచి నామినేషన్‌కు భారీగా తరలివెళ్తున్న నాయకులు



మార్టూరు నుంచి పర్చూరుకు బయలుదేరి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చినగంజాం మండలం నుంచి నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులు

కమనీయం చెన్నకేశవుని కల్యాణం



అలంకరణలో స్వామి, అమ్మవార్లు



కొణిదెనలో కల్యాణంలో పాల్గొన్న జంటలు

బల్లికురవ: కొణిదెన గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి 19వ వార్షికోత్సవ తిరు కల్యాణం మంగళవారం కమనీయంగా జరిగింది. ఆలయ అర్చకులు ఐవీఎస్ శోభనాచార్యులు, డీ. పవన్ కృష్ణమాచార్యులు బృందంచే అమ్మవారిపురంలో ఉన్న ఇరువురు అమ్మవార్లను మేళతాళాలతో ఆలయం వద్దకు తీసుకొచ్చి ఎదుర్కోల నిర్వహించారు. ప్రత్యేక మందిరంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద మంత్రోచ్చరణలతో కల్యాణోత్సవం చేపట్టారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన అబ్బారెడ్డి వెంకటేశ్వర్లు, మార్టూరుకు చెందిన చెన్నకేశవరెడ్డి గ్రామానికి చెందిన భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో చావా వెంకటేశ్వర్లు, మాజీ ధర్మకర్త శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఇన్నమూరి కోటేశ్వరరావు, గుంజి సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 3 గంటల పాటు జరిగిన కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాణిరత్నప్రభ సేవలు అభినందనీయం



రాణిరత్నప్రభ దంపతులను సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు

వేటపాలెం: ఉపాధ్యాయురాలుగా రాణి రత్నప్రభ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడంలో చేసిన సేవలు అభినందనీయమని హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి అబినందించారు. అక్కాయిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న రాణిరత్నప్రభకు మంగళవారం అభినందన సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 26 ఏళ్లగా చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయురాలి దంపతులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కె రత్నప్రభ, వాణి, శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రమణ్యం, ఖమరున్నిసా బేగం పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకున్న ప్రభుత్వం



వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న పొట్టి శ్రీరాములు టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు

- వెంకటేష్‌కు టాక్సీ డ్రైవర్ యూనియన్ మద్దతు

చీరాల టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్మికులను అన్ని విధాల ఆదుకున్నారని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం పొట్టి శ్రీరాములు టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు వెంకటేష్‌కు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్మికులను నిలువునా మోసం చేసిందన్నారు. కాని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కార్మికులను ఆదుకున్నారన్నారు. అంతేకాకుండా శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి టిప్పర్ డ్రైవర్‌కే టికెట్ ఇచ్చి గౌరవం ఇచ్చారన్నారు. అనంతరం టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు కొన్ని సమస్యలు ఆయన ముందుకు తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందిస్తూ అధికారంలోకి రాగానే మీసమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. మీరందరూ చీరాలలో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు వై. పిచ్చిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని కఠారివారిపాలెం మత్స్యకార గ్రామంలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు మంగళవారం రాత్రి నిర్వహించారు. చీరాల ఎన్నికల అధికారి సూర్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మీకు నచ్చిన అభ్యర్థిని ఎంపిక చేసుకొని ఎన్ను కోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణకాంత్, ఓటర్లు పాల్గొన్నారు.

లక్ష తమలపాకుల పూజ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా స్వామివారిక లక్ష తమలపాలకుతో పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం అభిషేకం, అలంకరణ అనంతరం ఉభయదాతలు, భక్తులు, అర్చకులు మేళతాళాలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం 11 ఆవృత్తాలు వేదమంత్రోచ్చరణతో పండితులు, అర్చకులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రవీందర్

పర్చూరు (చినగంజాం): ఎన్నికల విధులు నిర్వహిస్తున్న డ్రైవర్‌లు, వీడియోగ్రాఫర్లు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని పర్చూరు ఆర్‌ఓ జీ రవీందర్ సూచించారు. మంగళవారం పర్చూరు తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికలలో డ్యూటీ చేస్తున్న డ్రైవర్‌లకు, వీడియోగ్రాఫర్లకు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులకు డ్యూటీ చేస్తున్న డ్రైవర్‌లు, వీడియో గ్రాఫర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్వోలు సుబ్బయ్య, మెహెర్ బాబు, ఫణీంద్రబాబు. ప్రమీల, సంధ్యశ్రీ, ఎంపీడీఓలు శ్రీనివాసరెడ్డి, నితిన్, బాబురావు, సుబ్రమణ్యం, వరప్రసాద్, వీడియోగ్రాఫర్లు, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా ఈర్లగంగమ్మ వార్షిక తిరునాళ్లు



పొంగళ్లు పెడుతున్న భక్తులు

బల్లికురవ: భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, కొత్త మల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం, కొణిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాలతోపాటు పరిసర గ్రామాలనుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఎంతో విశిష్టత కలిగిన మర్రి ఈర్లకొండ గ్రానైట్ నిర్వాహకులు ఆలయం సమీపంలో కొంటర్లు ఏర్పాటు చేసి మంచినీళ్లు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లతో పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరంగా అన్నసంతర్పణ చేశారు. మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, గ్రామాలకు చెందిన యువత ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, బ్రహ్మంగారి నాటకం, ఎల్‌ఈడీ ప్రభ భక్తులను ఆకట్టుకుంది. సంతమాగులూరు సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్సైలు సీ.బాలకృష్ణ, బీ. శ్రీనివాసరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో పూజాధికార్యక్రమాలకు తిరునాళ్ల రోజు నుంచి రాబోయో ఏడాది తిరునాళ్ల వరకు పాట నిర్వహించటం ఆనవాయితీ. గతేడాది 5.1 లక్షలకు నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన చల్లగుండ్ల శ్రీనివాసరావు పూజాది కార్యక్రమాలను పాటద్వారా దక్కించుకున్నారు. ఈఏడాది ఎన్నికల కోడ్‌తో ప్రభలు లేనందున శ్రీనివాసరావు రూ. 4.9 లక్షలకు కైవం చేసుకుని సొమ్ము చెల్లించారు.

విద్యార్థులకు ఉన్నత లక్ష్యం అవసరం

వేటపాలెం: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత చదువుల్లో రాణించాలని హెచ్‌ఎం కే సుబ్బారావు సూచించారు. కఠారివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులకు అభినందన సమావేశం మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సముద్రతీర మత్స్యకార గ్రామంలో పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రభుత్వం స్కూల్స్‌లో చదువుకొని మొదటిసారిగా 16 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవాడ అజయ్‌బాబు, భవనం రాణీ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు